జగనన్న ప్రభుత్వానికే ప్రజల మద్దతు

- మేయర్ హరివెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- తూర్పులో 'జగనన్నే మా భవిష్యత్తు' ర్యాలీ



కేక్ కట్ చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల


బీఆర్‌టీఎస్‌లో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బీచ్‌రోడ్డు: ప్రజల మద్దతు జగనన్న ప్రభుత్వానికే ఉందని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు ..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. బీచ్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన జగనన్నే మా భవిష్యత్తు ..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో 86 వేల మంది కలవడం జరిగిందన్నారు. వారిలో 60 వేల మంది తమ మద్దతు తెలుపుతూ మిస్డ్‌కాల్ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం కంటే ప్రస్తుతం జగనన్న ప్రభుత్వానికే ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోందన్నారు. మరో 20 ఏళ్లు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం ఖాయమని ప్రజల మద్దతు చూస్తుంటే అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు పరిశీలకుడు సూర్యనారాయణ రాజు, వార్డు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీ ర్యాలీ

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గంలో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పెదగదిలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. పెదగదిలిలో ప్రారంభమైన ఈ ర్యాలీ బీఆర్‌టీఎస్ రోడ్డులో హనుమంతవాక వరకు అక్కడ నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం బీచ్‌రోడ్డుకు చేరుకొంది. అక్కడ నుంచి అప్పుఘర్, ఎంవీపీ డబుల్ రోడ్డు, టీటీడీ సర్కిల్, ఇసుకతోట, శివాజీపార్కు రోడ్డు, పోలమాంబ ఆలయం మీదుగా సిరిపురం కూడలికి చేరింది. అక్కడ నుంచి ఏయూ అవుట్ గేటు మీదుగా పార్కు హోటల్ ఎదురుగా వై.ఎస్.ఆర్ విగ్రహం వద్దకు చేరుకొంది. ఈ ర్యాలీకి నియోజకవర్గం పరిశీలకుడు సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, 15 వార్డుల నుంచి ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వార్డుల ఇన్‌చార్జులు, అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, మొల్లి అప్పారావు, అల్లంపల్లి రాజబాబు, సత్తి మందారెడ్డి, బోని శివరామకృష్ణ, అప్పారి గురిబాబు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఆర్కే బీచ్ వద్ద సైకిల్ ర్యాలీ

మల్కాపురం: పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంరక్షణ్ క్షమాత మహోత్సవ్ ప్రచార కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నారు. మే 8వ తేదీ వరకు ఇవి కొనసాగుతాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఇంధన రూపాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్ వద్ద సైకిల్ ర్యాలీ(సైక్లోథాన్) నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని సంస్థ ఈడీ వి.రతన్‌రాజ్ అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారు. వచ్చే నెల 8 వరకు హెచ్‌పీసీఎల్ యాజమాన్యం సంరక్షణ్ మహోత్సవ్ ప్రచారాలు, వివిధ కార్యక్రమాలను చేపడుతుంది.

అన్నపూర్ణాదేవిగా చిన పోలమాంబ అమ్మవారు


అన్నపూర్ణదేవిగా పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం : శివాజీపాలెంలో చిన పోలమాంబ అమ్మవారు ఉత్సవాలలో భాగంగా ఆరో రోజు శనివారం అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి భక్తులకు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆది ,సోమ, మంగళవారంలో జరిగే పండగకు శివాజీపాలెం, పీతలవానిపాలెం, తదితర ప్రాంతాలలో ఏర్పాట్లు చేస్తున్నారు.

సుందరీకరణకు అధిక ప్రాధాన్యం


మొక్క నాటుతున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సుందరీకరణ, వృక్ష సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నూతనంగా నిర్మించిన భవనాల చుట్టూ పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దే విధంగా ప్రత్యేకంగా కృషిచేస్తున్నారు. ఏయూ ఫార్మా టెస్టింగ్, ఇంక్యుబేషన్ సెంటర్ వద్ద శనివారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ ఆచార్య వజీర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు.. కృష్ణమూర్తి


కృష్ణమూర్తి సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

ఆరిలోవ: ఆరిలోవలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీపీఎం నాయకుడు వి.కృష్ణమూర్తి ఆదర్శ కమ్యూనిస్టు అని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ తెలిపారు. ఆరిలోవ క్రాంతినగర్‌లో కృష్ణారావు నివాసం వద్ద శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ శర్మతో పాటు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి కుమార్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దాలి


విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రంగారావు

ఆరిలోవ: గురుకులాల్లో విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాలని ఐపీఎస్ అధికారి ఎల్‌కేవీ రంగారావు సూచించారు. గురుకుల పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఇటీవల విశాఖ, అనకాపల్లి జిల్లాలో విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై పోటీ పరీక్షలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమం శనివారం శ్రీకృష్ణాపురం గురుకులంలో నిర్వహించారు. విజేతలకు రంగారావు, గురుకులాల విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయధికారి శంబాన రూపావతి, విజయనగరం జిల్లా గురుకులాల జిల్లా సమన్వయధికారి బలగ చంద్రావతి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గురుకులాల్లో గతంలో కంటే సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ టి.ఎం ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు, కార్యక్రమం నిర్వహకుడు కై లాష్, గురుకులం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కళాభారతిలో నేడు గాత్ర కచేరి

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ శంకర జయంతి సందర్భంగా డాక్టర్. మండపాక శారదతో పాటు 20 మంది గాత్ర కచేరిని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్. పేరాల బాలమురళీ కృష్ణ వ్యవహరించనున్నారు. సాయంత్రం 6.30గంటల నుంచి కచేరి ప్రారంభమవుతుందని నిర్వహకులు తెలిపారు.

సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని తదితరులు

ఎంవీపీకాలనీ: 17వ వార్డు ఆదర్శనగర్ 103 సచివాలయం పరిధిలో సీసీ డ్రైన్ పనులకు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలిసి పనులను ప్రారంభించారు. గత కొంతకాలంగా ఈ డ్రైన్ నిర్మాణానికి స్థానిక ప్రజల నుంచి వస్తున్న వినతుల నేపథ్యంలో ఈ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.జీవీఎంసీ ఏఈ శిరీషా, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల నాగరాజు, నీలారెడ్డి, లవణకుమార్, సత్యవతి, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది లింగంపల్లి శ్రీనివాస్ మృతి


న్యాయవాది లింగంపల్లి శ్రీనివాసరావు

అల్లిపురం: సీనియర్ న్యాయవాది లింగంపల్లి శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎన్‌బీఎం న్యాయ కళాశాల పూర్వవిద్యార్థి అయిన ఆయన గత 29 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల విద్యార్థి నాయకుడిగా, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి సంతాపం వ్యక్తం చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పి.నరసింగరావు, ఎస్.కృష్ణమోహన్, బైసా అరుణ్‌కుమార్, గీతం కళాశాల అధ్యాపకులు ఆచార్య రాఘవయ్య, ఆచార్య అనితారావు, ఎన్‌బీఎం న్యాయకళాశాల అధ్యాపకులు డీవీ రమణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ స్వామి సంతాపం తెలిపారు.

ముం'చెత్త'గా..

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని శానిటరీ సిబ్బంది


కేఆర్‌ఎంకాలనీలో పూడికలు తీసి కుప్పలుగా ఉన్న దృశ్యం


కాలనీలో ఇరువైపులా చెత్త కుప్పలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16, 23వ వార్డులలో మద్దిలపాలెం, కేఆర్‌ఎంకాలనీల మీదుగా ప్రవహిస్తున్న పెద్ద కాలువలో తీసిన వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడే డంప్ చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు ఆరోపించారు. కాలనీలో రోడ్డుకిరువైపులు పెద్ద కుప్పలుగా వేయడంతో ఆ రోడ్డుగుండా రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. చెత్త కుప్పలపై ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు దృష్టికి తీసుకు వెళ్లి పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణం తొలగిస్తామని సచివాలయ సిబ్బంది ఈ సందర్భంగా చెప్పారు.

అనధికార బడ్డీలు..ఆపై ట్రాఫిక్ ఇబ్బందులు


డెయిరీఫారం వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీల వద్ద గుమిగూడిన జనం

ఆరిలోవ : అసలే అనధికారిక బడ్డీలు..పైగా నా బడ్డీ ముందు నువ్వెందుకు షాపు పెట్టావంటూ నిత్యం గొడవ..వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు... ఇవి 10వ వార్డు డెయిరీ ఫారం వద్ద రెండు రోజులుగా జరుగుతున్న తంతు. జాతీయరహదారి వద్ద డెయిరీఫారం కూడలి నుంచి ఆదర్శనగర్ వైపు పశు సంవర్ధక శాఖగేటు వరకు ఇటీవల అనధికారికంగా పదుల సంఖ్యలో బడ్డీలు రహదారికి ఇరుపక్కలా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రోడ్డు ఇరుకై వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై వారం క్రితం సాక్షిలో కథనం కూడా ప్రచురితమైంది. ఇదిలా ఉండగా పశు సంవర్ధక శాఖ కార్యాలయం గేటు పక్కన ఓ వ్యక్తి ఇటీవల అనధికారికంగా బడ్డీ ఏర్పాటు చేసి దాన్ని అమ్మకానికి పెట్టాడు. అనుకొన్న బేరం రాకపోవడంతో ప్రస్తుతం ఆ బడ్డీ మూసేశారు. దాని ముందు మరో మహిళ తోపుడు బండిపై చిన్న దుకాణం పెట్టింది. దీంతో సదరు వ్యక్తి తన బడ్డీ ముందు నీవు వ్యాపారం చేయడమేమిటంటూ ఆ మహిళను నిలదీశాడు. ఈ వ్యవహారంపై వారిద్దరి మధ్య రెండు రోజులుగా గొడవ జరుగుతోంది. అక్కడ అనధికారికంగా బడ్డీలు పెట్టినవారు రెండు వర్గాలుగా విడిపోయి గందరగోళం సృష్టిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అనధికారిక బడ్డీలు అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోకుండా వదిలేశారని స్థానికులు, వాహనచోదకులు విమర్శిస్తున్నారు.

ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న పన్ను తొలగింపు



శస్త్ర చికిత్స చేసిన వైద్యుల బృందం (ఇన్‌సెట్) తొలగించిన పన్ను

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ మెడికవర్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. వివరాలను శనివారం ఆస్పత్రి యాజమాన్యం ప్రకటనలో తెలిపింది. ఏడాది క్రితం బైక్ ప్రమాదానికి గురైన ఓ 16 ఏళ్ల యువకుడు 8 నెలలుగా తీవ్ర దగ్గుతో బాధపడుతున్నాడు. చాలా ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. అయితే మెరుగైన వైద్యం కోసం మెడికవర్‌కు వచ్చిన ఆ యువకుడు ఊపిరితిత్తుల విభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌కుమార్‌కు చూపించడంతో అనుమానం వచ్చిన ఆయన ఛాతిని ఎక్స్‌రే తీయించారు. యువకుడి ఊపిరితిత్తుల ఎడమ వైపున చిన్న వస్తువును గుర్తించారు. డాక్టర్ ప్రేమ్‌కుమార్‌తో పాటు వైద్యులు సుధీర్, సత్యపద్మజ, మోనిషాతో కూడిన బృందం అది పన్నుగా గుర్తించారు. అనంతరం తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు అనస్థీషియా డాక్టర్‌తో సంప్రదించి బ్రాంకోస్కోపి, ఫోర్సెప్స్ సాంకేతికతను ఉపయోగించి ఊపిరితిత్తుల్లో చిక్కుకున్న పంటిని తొలగించారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తికావడంతో యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. అనంతరం డాక్టర్ల బృందాన్ని యువకుడి కుటుంబ సభ్యులతోపాటు ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది.

భవిష్యత్తులో ఫార్మా రంగంలో నూతన ఆవిష్కరణలు


సదస్సునుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో శనివారం రీసెంట్ ట్రెండ్స్ ఇన్ రేషనల్ డ్రగ్ డిస్కవరి' అంశంపై ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ పదవీ విరమణను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈసదస్సును వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏయూ ఫార్మసీ కళాశాల ఎందరో నిపుణులను అందించిందన్నారు. భవిష్యత్తులో ఫార్మా రంగంలో నూతన ఆవిష్కరణలు జరిపే విధంగా ఫార్మ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను అభివృద్ధి చేశామన్నారు. త్వరలో దీని సేవలు ప్రారంభిస్తామని, విభాగ విద్యార్థులు అక్కడ పనిచేయాలని, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందాలని సూచించారు. స్టార్టప్ రంగంలో పనిచేసే వారికి అవసరమైన మార్గదర్శకం,సహకారం వర్సిటీ అందిస్తుందన్నారు. అనంతరం ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఏ.కె.ఎం పవార్, ఆచార్య గిరిజా శంకర్, ఐఐసిటి శాస్త్రవేత్త డాక్టర్‌సురేష్‌బాబు, ఆచార్యులు వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వర్ కుమార్, ఎం.మురళీకృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయ సంబంధాలను మెరుగుపరచుకోవాలి



ఆచార్యులతో విద్యార్థులు

ఏయూక్యాంపస్: విద్యతో పాటు మానవీయ సంబంధాలను మెరుగుపరచుకోవాలని ఏయూ తెలుగు శాఖ గౌరవాచార్యులు జి.యోహాన్‌బాబు అన్నారు. శనివారం విభాగ విభాగ సమావేశమందిరంలో ఎంఏ తెలుగు రెండో సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సర విద్యార్థులతో వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య యోహాన్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచి వ్యక్తిగా సమాజంలోని వెళ్లే సమయంలో సంభాషణ నైపుణ్యాలు, సత్సంబంధాలు కలిగి ఉండటం వ్యక్తి ప్రగతిని ప్రభావితం చేస్తాయన్నారు. నేడు వాస్తవిక సమాజంలో నేర్చుకునే పాఠాలు ఎంతో కీలకంగా నిలుస్తాయన్నారు. ప్రాచీన సాహిత్య కథల నుంచి మానవీయ విలువలను నేర్చుకోవాలన్నారు. విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యోహాన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మానవీయ సంబంధాలు మెరుగుపర్చుకోవాలన్నారు. జీవితంలో నేర్చుకునే పాఠాలే ఆకళింపు చేసుకొంటూ అవగాహనతో ముందుకు నడవాలన్నారు. విద్యార్థులు ప్రాచీన సాహిత్యంలో కథల ద్వారా మానవీయ నైతిక విలువలు గ్రహించాలన్నారు.

ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ విద్యార్థి దశ చాల క్లిష్టమైనదన్నారు. క్రమశిక్షణ ,సమయపాలన, ఆశయం అనే సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు (యోగి), అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సన విద్యార్థులు పాల్గొన్నారు.

భవన పటిష్టత పరీక్షలపై అవగాహన


ఆచార్య రామశేషును సత్కరిస్తున్న సత్యనారాయణ రెడ్డి

ఏయూక్యాంపస్: కాంక్రిట్ భవనాల పటిష్టతను గుర్తించే వివిధ పరీక్షలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–వరంగల్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు రామశేషు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం విభాగంలో కాంక్రిట్ స్ట్రక్చర్ –నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా రీబౌండ్‌హామర్, అల్ట్రాపల్స్ వెలాసిటీ, అల్ట్రాసోనిక్‌థర్మోగ్రఫీ, విండ్సర్ ప్రోబ్, ఇన్‌ఫ్రా రెడ్ థర్మోగ్రఫీ, కవర్‌మీటర్, కాంక్రిట్‌ఇమేజింగ్, గ్రౌండ్ పెనెట్రేటింగ్‌రాడార్, రేడియోగ్రఫీ, ఎన్‌డీటీ ఇంపాక్ట్ ఎకో, లోడ్‌టెస్టింగ్ తదితర పద్ధతులను విద్యార్థులకు వివరించారు.

కాంక్రిట్ భవనాల నిర్మాణ మూలకాల నాణ్యత, పటిష్టత, సమగ్రత, పగుళ్లు, లోపాలను గుర్తించడం వాటి పరిస్థితిని అంచనా వేసే విధానాలు తెలియజేశారు. చమురు నిల్వ ట్యాంకులు, డెక్ స్లాబ్‌వంతెను, మహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలు, అగ్ని ప్రమాద ప్రభావితి నిర్మాణాలకు ఉదాహరణలతో వివరించారు.

విభాగాధిపతి ఆచార్య సీఎన్‌వీ సత్యనారాయణ రెడ్డి, ఆచార్య డి.ఎస్.ఆర్ మూర్తి, ఆచార్య జీవీ రామారావు, ఆచార్య రాజశేఖర్, డాక్టర్ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విభాగ విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు.

మహిళలకు వరం.. 'మహిళా సమ్మాన్'


మహిళకు సమ్మాన్ సర్టిఫికెట్ దరఖాస్తు ఫారం అందజేస్తున్న ఏడీ నాగ ఆదిత్యకుమార్

ఎంవీపీకాలనీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తెచ్చిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంపై తపాలా శాఖ ఏడీ నాగ ఆదిత్య కుమార్ అవగాహన కల్పించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీ నాగ అదిత్యకుమార్ మాట్లాడుతూ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని తపాలా శాఖ ద్వారా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ పథకం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ పథకం ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2025 వరకు మాత్రమే (24 నెలలు)అమలులో ఉంటుంది. 18 ఏళ్లు నిండిన మహిళతో పాటు మైనర్లు ఈ పథకం ద్వారా లబ్ధిపొందొచ్చన్నారు. రూ. 1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జమ చేసి ఖాతా తెరవాల్సి వుంటుందన్నారు. ఆడపిల్లల సంరక్షకులు ఈ ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. ఈ స్కీమ్ లో వార్షిక వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. వడ్డీ ప్రతి మూడు నెలలకోసారి లెక్కించి.. ఖాతాలో జమ చేస్తారు. రెండేళ్ల తర్వాత ఈ ఖాతా మెచ్యూర్ అవుతుంది. అప్పుడు ఫామ్–2 ఫిల్ చేసి డబ్బులు తీసుకోవచ్చు.. ఖాతా తెరిచిన ఏడాది తర్వాత 40 శాతం డబ్బులు తీసుకోవచ్చు. ఇక డిపాజిట్ చేసిన ఏడాది గడచిన తర్వాత డబ్బులు కావాలనుకుంటే 40 శాతం వరకు విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది. ఇందుకోసం ఫామ్–3 అప్లికేషన్ ఫిల్ చేయాలి. ఒకవేళ ఖాతాదారుడు మరణించినా, తీవ్ర అనారోగ్యానికి గురైన సమయంలో ఖాతా తెరిచిన ఆరు నెలల తర్వాత అకౌంట్ క్లోజ్ చేసే వీలుంటుందని ఏడీ నాగ అదిత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీబీవీఎస్ ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను గుర్తించింది జగనే

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

ఎంవీపీకాలనీ : బీసీలకు సముచిత స్థానం కల్పించింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అనకాపల్లి వేదికగా బీసీ గర్జన సభలో పాల్గొనేందుకు కృష్ణయ్య విశాఖ వచ్చారు. ఎయిర్‌పోర్టులో నగర బీసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు గౌరవం దక్కుతోందన్నారు. వివిధ అంశాలపై నగర బీసీ నాయకులతో కృష్ణయ్య చర్చించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ బోను దుర్గా నరేష్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లా నివాస్, రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు అనచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఎంవీపీకాలనీ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన 18వ వార్డుకు చెందిన సూరాడ మహేష్ వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్ గాయపడ్డాడు. విషయం తెలుసుకుని శనివారం మహేష్ ఇంటికి వచ్చి పరామర్శించారు. పార్టీ తరుపున ఆదుకునేందుకు కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.